సాక్షి నిర్మల్

సోమవారం : 16 : జూన్ : 2025



తేమ లేకుండానే విత్తనం

రుతుపవనాలు వచ్చినా తొలకరి వర్షాలు ఇంకా పలకరించనేలేదు. అయినా మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. 8లో▸



భయం భయంగా చదువులు

భైంసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు మీడియం) భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థులు భయంభయంగా చదువులు కొనసాగిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్జీయూకేటీ అధ్యాపకుడికి డాక్టరేట్



ఉపేందర్‌రావును అభినందిస్తున్న గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ బత్తిన ఉపేందర్‌రావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ డిఫెక్టెడ్ గ్రౌండ్ స్ట్రక్చర్ ఆన్ మైక్రోస్ట్రిప్ పాథ్ అంటెన్నా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఇచ్చింది. ఉపేందర్‌రావును ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధ్యాపకులు ఆదివారం అభినందించారు. ఈ పరిశోధన ద్వారా వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో హై డేటా రేట్ స్పీడ్ సాధ్యం కావచ్చని ఇన్‌చార్జి వీసీ వెల్లడించారు.

అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



దర్శనానికి క్యూలైన్లలో నిల్చున్న భక్తులు

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో రమేశ్, చైర్మన్ భోజాగౌడ్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, హారతి, అర్చన, పల్లకీసేవ నిర్వహించగా అధికసంఖ్యలో పాల్గొన్నారు. బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

కుంటాల: రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని కల్లూరులో ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఏవో విక్రమ్, ఏఈవో గణేశ్ తదితరులున్నారు.

'పరిహారం ఇచ్చేదాకా కదలం'

కడెం: అటవీశాఖ అధికారులు తమకు ఇస్తామన్నా పునరావాస పరిహారం ఇచ్చేదాకా పాత ఊళ్ల నుంచి కదలబోమని రాంపూర్, మైసంపేట్ వాసులు పట్టుబట్టారు. ఈనెల 9న పాత ఊరికి వెళ్లిన గిరిజనులు అక్కడే గుడిసెలు వేసుకుని మకాం వేశారు. సాగు భూములకు పట్టాలు, ప్యాకేజీలో అందాల్సిన నగదు, తదితర సమస్యలు పరిష్కరిస్తేనే ఇక్కడ నుంచి కదులుతామని తెలిపారు. లేనిపక్షంలో ఇక్కడే సాగు పనులు చేపడతామని హెచ్చరించారు.

ఆత్మీయ సమ్మేళనం




మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ టౌన్: చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని నాయుడువాడలోగల సంఘ భవనంలో నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు, అవార్డు గ్రహీతలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. గౌరవాధ్యక్షుడు లింబగిరి స్వామి, డివిజన్ గౌరవాధ్యక్షుడు నారాయణ స్వామి, జిల్లా, డివిజన్ అధ్యక్షులు మధుసూదన్, కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి మనోహర్ స్వామి, సుదర్శనస్వామి, కృష్ణమూర్తి, లక్ష్మణస్వామి, సంతోష్, వినోద్ ఉన్నారు.

గోదావరి నది నుంచి మృతదేహాలను బయటకు తీసుకువస్తున్న బాధిత కుటుంబీకులు





రాకేశ్, భరత్ (ఫైల్)

మదన్ (ఫైల్)

గోదావరిలో మృత్యు ఘోష

- నీట మునిగి ఐదుగురు మృతి
- మృతులంతా 22 ఏళ్లలోపు వారే
- నిర్మల్ జిల్లా బాసర వద్ద ఘటన
- మృతుల్లో ముగ్గురు అన్నదమ్ములు
- మిన్నంటిన తల్లిదండ్రుల రోదన
- ఆస్పత్రి సిబ్బంది తీరుపై ఆగ్రహం

భైంసా/భైంసాటౌన్/బాసర: బాసర గోదావరి నది ఐదుగురిని పొట్టన పెట్టుకుంది. పుణ్యస్నానాలకు నదిలోకి దిగిన యువకులను పరలోకాలకు పంపింది. వివరాలు.. హైదరాబాద్‌లో స్థిరపడిన రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి ప్రేమ్‌రాంకు భరత్ (16), మదన్ (18), రాకేశ్ (20) ముగ్గురు సంతానం. వీరిని హైదరాబాద్‌లో చదివిస్తున్నాడు. ప్రేమ్‌రాం తన మరదలి కొడుకైన వినోద్(19)కు హైదరాబాద్‌లోనే ఎస్సార్ నగర్‌లో నీట్ కోచింగ్ ఇప్పించాడు. విద్యాసంవత్సరం ఆరంభంలో ప్రేమ్‌రాం ఎప్పటిలాగే తన భార్య సోను, ముగ్గురు కొడుకులతోపాటు మరదలి కొడుకైన వినోద్, బంధువుల కుమారుడు రుతిక్ (22)ను ఆదివారం రైలులో సరస్వతీ అమ్మవారి దర్శనానికి బాసరకు పంపించాడు. బాసరకు చేరుకున్న వీరు ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలాచరించేందుకు వెళ్లారు. స్నాన ఘట్టాల వద్ద నీరు మురికిగా ఉందని గోదావరినది మధ్యలో తేలిన ఇసుక తిన్నెల వద్ద స్నానం చేయాలని నిర్ణయించుకున్నారు. అక్కడికి బోటులో వెళ్లి స్నానాలు చేస్తున్నారు. ఈ క్రమంలో లోతు తెలియక ప్రేమ్‌రాం–సోను దంపతుల ముగ్గురు కొడుకులతో పాటు మరదలి కుమారుడు వినోద్, మరో యువకుడు రుతిక్ నీట మునిగి విగతజీవులయ్యారు. వీరి మృతదేహాలను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ప్రేమ్‌రాం–సోను కుమారుల మృతదేహాలతోపాటు వినోద్ మృతదేహాన్ని రాజస్థాన్‌కు పంపించారు. బంధువుల కుమారుడైన రుతిక్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు పంపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాసర ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

తల్లడిల్లిన తల్లి హృదయం

తన ముగ్గురు కొడుకులను కోల్పోయిన తల్లి సోను కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆస్పత్రిలో కొడుకుల మృతదేహాలపై రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ముగ్గురు కొడుకులను కోల్పోయిన తాను ఇక బతికుండలేనని గుండెలవిసేలా రోదించింది. ఏదైనా వాహనం కింద పడి చనిపోతానని బయటకు పరుగెత్తింది. సమీప బంధువులు ఓదార్చి ఆమెను పక్కకు తీసుకెళ్లారు.



భైంసా ఏరియాస్పత్రిలో కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న సోను



గోదావరి ఒడ్డున విలపిస్తున్న సోను

జవాబు లేని ప్రశ్నలు

ఆదివారం బాసర గోదావరిలో యువకులను పోగొట్టుకున్న కుటుంబీకులు ఆవేదనతో అడిగిన ప్రశ్నలు జవాబులు లేనివిగా మిగిలాయి. నీటిలో మునుగుతున్న తమ పిల్లలను కాపాడాలని ప్రాధేయపడ్డా ఎవరూ దగ్గరికి రాలేదని వాపోయారు. నది నీటిలో మునిగి కొన ఊపిరితో ఉన్న తమ పిల్లలను కాపాడాలని అరిచినా గోదావరి పరిసరాల్లో ఓ వైద్యుడు, సిబ్బంది కనిపించలేదన్నారు. సీపీఆర్ చేసినా, అత్యవసర వైద్య సేవలు అక్కడే అంది ఉంటే పిల్లలు బతికేవారని బాధిత కుటుంబీకులు వాపోయారు. నీటి లోతు తెలిపే హెచ్చరించే బోర్డులు కూడా ఎక్కడా లేవని, అంబులెన్స్‌లో ఆస్పత్రికి వచ్చినా సరైన సేవలు అందలేదని ఆరోపించారు. బాధిత కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రిలో మీడియా ఎదుట అడిగిన ప్రశ్నలు జవాబులు లేనివిగా మిగిలాయి.

వరుస ఘటనలతో..

బాసరలో ఇటీవలి కాలంలో ఇలాంటి వరుస ఘటనలు జరుగుతున్నా పట్టింపు కరువైంది. మే 26న మహారాష్ట్ర నుంచి వచ్చిన కులదీప్‌బాబాసాహెబ్ అనే బాలుడు, నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కమలాపూర్‌కు చెందిన యువకుడు బొల్లమల రాజు పుణ్యస్నానాల కోసం గోదావరిలోకి దిగి నీట మునిగి ఇదే ప్రాంతంలో మృతి చెందారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు పదుల సంఖ్యలో మృతిచెందినా రక్షణ చర్యలు కరువయ్యాయి. ఎలాంటి హెచ్చరికలు జారీ చేయడం లేదు. లోతు, బురద ప్రాంతాల్లోనూ బోట్లు తిప్పుతున్నా నియంత్రించడంలేదు. స్నానఘట్టాల వద్ద చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతోనే భక్తులు అవగాహన లేకుండా గోదావరిలోని లోతైన ప్రాంతాలకు స్నానాలకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆలయ అధికారులు భక్తుల రక్షణ చర్యలపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

ఫాదర్స్ డే రోజునే ఘటన

ఫాదర్స్ డే రోజే ఐదుగురు యువకులు దుర్మరణం చెందడం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. 'హ్యాపీ ఫాదర్స్ డే' అని చెప్పి రైలెక్కిన ముగ్గురు కొడుకులు తిరిగి రాని లోకాలకు వెళ్లడాన్ని ప్రేమ్‌రాం జీర్ణించుకోలేకపోతున్నాడు. తన కొడుకులతోపాటు మరదలి కొడుకు, బంధువుల కుమారుడి మృతి వార్త తెలిసి హుటాహుటిన హైదరాబాద్ నుంచి భైంసా ఏరియాస్పత్రికి చేరుకున్నాడు. విగతజీవులైన కొడుకులను చూసి బోరున విలపించాడు.

బాసరలో భక్తుల మృతి దురదృష్టకరం

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: బాసర గోదావరి నదిలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు నీట మునిగి మృతి చెందడంపై కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. గతంలోనే నది సమీపంలో మెట్లు నిర్మించిన ప్రాంతం మినహా ఇతర ప్రాంతాల్లో స్నానాలు చేయడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. భద్రత నిబంధనలు మరింత కఠినంగా అమలు చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ ఘటనపై ఇప్పటికే భైంసా ఆర్డీవోతో మాట్లాడినట్లు తెలిపారు. ఘటనపై సమీక్షించి, సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. భక్తుల భద్రతకు సంబంధించి పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: బాసర పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు నది స్నానం ఆచరించేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల ఓ ప్రకటనలో సూచించారు. ఆదివారం నదిలో మునిగి ఐదుగురు యువకులు మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై వెంటనే సంబంధిత అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. స్నానఘట్టాల వద్ద మాత్రమే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని ప్రదేశాల్లో భక్తులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఆదేశించారు.

ఏడాదిలో ఎన్నో.. చేయాల్సినవి మరెన్నో..



క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

- అభిలాషపై ఇప్పటికీ జిల్లా ఆశలు
- కలెక్టర్‌గా నియమితులై నేటికి ఏడాది

నిర్మల్: జిల్లా ఆరో కలెక్టర్‌గా అభిలాషఅభినవ్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాదవుతోంది. కలెక్టర్‌గా తొలిపోస్టింగ్ జిల్లాలోనే తీసుకున్న ఆమె ఎన్నో పనులను విజయవంతంగా పూర్తిచేశారు. జిల్లాచరిత్రలో తొలిసారి 'నిర్మల్ ఉత్సవాలు' నిర్వహించి ఓ ట్రెండ్ సెట్ చేశారు. బాలశక్తి లాంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రస్థాయిలో జిల్లాపేరును నిలబెట్టారు. పాలనాపరంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. కొత్తగా ఎన్నో పనులు చేపట్టినా.. కలెక్టర్‌గా మరెన్నో జిల్లావాసుల ఆశలు పూర్తిచేయాల్సి ఉంది.

పాలనలో తన ముద్ర

సీరియస్ అధికారిగా పేరొందిన ఆశిష్‌సంగ్వాన్ తర్వాత కలెక్టర్‌గా నియమితులైన అభిలాష అభినవ్ ఎలా ఉంటారోనన్న ఆతృత జిల్లా అధికారులతో సహ ప్రజల్లోనూ ఉండేది. తాను క్రమంగా జిల్లాపై పట్టు పెంచుకుంటూ వివిధ రంగాల్లో ప్రగతికి పునాది వేశారు. బాలశక్తి నుంచి భూముల రక్షణ వరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలులో విశేష కృషి చేశారు.

చేసినవాటిలో కొన్ని..

- అంగన్‌వాడీల నుంచి ఉన్నతపాఠశాలల వరకు సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు.. హాస్టళ్లలో రాత్రిపూట ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలెక్టర్ రాత్రి బస చేస్తూ.. వారి సమస్యలు తెలుసుకున్నారు.
- వైద్యరంగంలో పలు ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. ఖానాపూర్ ఆస్పత్రిలో కొత్తగా ఆర్థో విభాగం ఏర్పాటైంది. జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ల నియామకంతో ప్రసవాల సంఖ్య పెరిగింది.
- కలెక్టర్ అభిలాషఅభినవ్ స్వయంగా ప్రారంభించిన బాలశక్తి కార్యక్రమానికి రాష్ట్రస్థాయి గుర్తింపు దక్కింది. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి 2024 సెప్టెంబర్ 20న 'బాలశక్తి' ప్రారంభించారు. 19వేల మంది విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్, 1,274 మందికి కంటి అద్దాలు అందించారు.
- ప్రభుత్వ భూముల రక్షణకు ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలో ఆక్రమించిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భైంసా, నర్సాపూర్(జి), లోకేశ్వరం మండలాల్లో రూ.కోట్ల విలువైన భూములను స్వాధీనం చేసుకున్నారు.
- నిర్మల్ ఉత్సవాల పేరిట జిల్లాచరిత్రను ఈ తరానికి పరిచయం చేసే ప్రయత్నం ప్రారంభించారు. జిల్లా చరిత్ర, సాంస్కృతిక వైభవాన్ని ఈ ఉత్సవాల్లో చాటారు.
- పథకాల అమలులో పారదర్శకత పాటించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, భూముల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు, ధాన్యం కొనుగోళ్లలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు.
- ప్రజల ఫిర్యాదులకు స్పందిస్తూ 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఫోన్‌ద్వారా కూడా ప్రజల సమస్యలను తెలుసుకునే విధానాన్ని ప్రారంభించారు.
- మహిళా సంఘాలకు క్యాంటీన్లు, రుణ వితరణతోపాటు త్వరలో పెట్రోల్ బంక్‌ల నిర్వహణకు అవకాశమిస్తుండగా.. మైత్రి క్లినిక్, డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. మహిళా శక్తి భవనం త్వరలో ప్రారంభం కానుంది.

సమష్టిగా ముందుకు..

ఏడాదికాలం జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి దిశలో తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేశాను. మున్ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమష్టి సహకారంతో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తాను.

– అభిలాషఅభినవ్, కలెక్టర్

చేయాల్సినవెన్నో..

- ప్రధానంగా జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఇథనాల్ పరిశ్రమ వివాదాస్పదమైంది. ఆయిల్ పామ్ పరిశ్రమ కూడా అలాగే తయారైంది. పారిశ్రామిక ప్రగతికి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.
- కాళేశ్వరం పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన 27వ ప్యాకేజీని ప్రారంభించినా.. ఇప్పటికీ నీటిని ఎత్తిపోయడం లేదు. 28వ ప్యాకేజీ పనులే పూర్తి కాలేదు.
- జిల్లా వరుసగా రెండుసార్లు పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఆ స్థానం దిగజారింది. మళ్లీ ప్రథమ స్థానానికి ప్రణాళికలు వేయాలి.
- ప్రధానంగా పర్యాటకంగా జిల్లాలో అభివృద్ధి శూన్యం. చేసేందుకు చాలా అవకాశాలున్నాయి. వాటిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.
- జిల్లాకేంద్రంలో కబ్జాలు కామన్‌గా మారాయి. ట్రాఫిక్ మొత్తం అస్తవ్యస్తంగా ఉంది. మున్సిపల్‌లో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది

- నేటి నుంచి ఎంపిక పోటీలు
- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రక్రియ
- ఎంపికైతే నాలుగో తరగతిలో ప్రవేశం



నిర్మల్ టౌన్: క్రీడా పాఠశాల ఆహ్వానిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేస్తూ.. కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు రాష్ట్రంలో మేడ్చల్ జిల్లాలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ప్రాంతీయ క్రీడా పాఠశాలలున్నాయి. ఇందులో 2025–2026 విద్యాసంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశం కోసం ఎంపిక పోటీలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది.

మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల కోసం మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈనెల 16నుంచి 19వరకు మండలస్థాయి, 23నుంచి 26వరకు జిల్లాస్థాయి, జూలై 1నుంచి 5వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 25న నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కల్పిస్తారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్‌లో శిక్షణ ఇస్తారు.


శారీరక సామర్థ్య పరీక్షలు ఇలా..

విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, 610 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఇలా తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

దరఖాస్తు విధానం ఇలా..

ప్రవేశ ఎంపికకు విద్యార్థులు ఒరిజినల్ ఆధార్ కార్డు, నాలుగో తరగతి చదువుతున్న సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రం, మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు దరఖాస్తుకు జత చేయాలి. 8–9 ఏళ్లలోపు 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య పుట్టినవారు అర్హులు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులు https:tgss. telangana. gov. in లో వివరాలు నమోదు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశానికి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారు. స్పోర్ట్స్ స్కూళ్లలో సాధించే సర్టిఫికెట్లతో క్రీడా కోట కింద ప్రత్యేక రిజర్వేషన్, ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందేందుకు అవకాశముంటుంది. క్రీడలపై ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు 7013396536, 9346655441 నంబర్లలో సంప్రదించాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి

పాఠశాలలో ఎకో క్లబ్‌లు

- పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం
- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఈద్‌గాం పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎకో క్లబ్ వలంటీర్లు (ఫైల్)

లక్ష్మణచాంద: ఆధునిక ప్రపంచంలో అభివృద్ధి పేరిట మానవ చర్యలతో ప్రకృతి, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మానవ మనుగడ, జీవవైవిధ్యానికి పెను ముప్పు తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు చేపడుతోంది. విద్యార్థులను పాఠశాలస్థాయి నుంచే పర్యావరణ సంరక్షణలో భాగస్వాములను చేసేందుకు కేంద్ర విద్యాశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయడం, ఈ సంవత్సరం నుంచి వాటిని 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'గా పునర్నామకరణం చేయడం జరిగింది.

పర్యావరణ సంరక్షణకు నూతన దిశ

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను చురుకైన భాగస్వాములను చేసేందుకు గతంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సంవత్సరం నుంచి ఈ క్లబ్‌లను 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'గా పిలవడం ద్వారా మరింత ఉత్తేజకరమైన కార్యకలాపాలను చేపట్టేందుకు కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ క్లబ్‌లను నూతనంగా ఏర్పాటు చేయాలని, ఆగస్టు 31 లోపు సంబంధిత వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇవ్వబడ్డాయి.

ఎకో క్లబ్‌ల విస్తరణ

జిల్లాలో 577 ప్రాథమిక పాఠశాలలు, 89 ప్రాథమికోన్నత పాఠశాలలు, 164ఉన్నత పాఠశాలలు సహా మొత్తం 830 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు పర్యావరణ అవగాహనను పెంపొందించే లక్ష్యాన్ని విద్యాశాఖ నిర్దేశించింది. ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

ఎకో క్లబ్‌ల నిర్మాణం, కార్యకలాపాలు

ప్రతీ పాఠశాలలో ఐదు ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇవి క్రింది విధంగా ఉంటాయి.

నీటి నిల్వ క్లబ్: నీటి పొదుపు, సంరక్షణపై అవగాహన.

నేల నిర్వహణ క్లబ్: నేల సంరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై దృష్టి.

శక్తి నిర్వహణ క్లబ్: శక్తి వనరుల సమర్థవంతమైన వినియోగం.

వ్యర్థ నిర్వహణ క్లబ్: వ్యర్థాల తగ్గింపు, రీసైక్లింగ్.

జీవవైవిధ్య క్లబ్: జీవవైవిధ్య సంరక్షణ, పరిరక్షణ.

ప్రతీ క్లబ్‌లో చురుకైన 10 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. దీని ద్వారా ఒక్కో పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. ఈ క్లబ్‌లు సంవత్సరం పొడవునా వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పిస్తాయి.

విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు

ఎకో క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు కింది అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు.

శక్తి ఆదా: విద్యుత్, ఇతర శక్తి వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం.

నీటి పొదుపు: నీటి వృథాను నివారించడం, సంరక్షణ పద్ధతులు.

ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ: ఒక్కసారి వాడే ప్లాస్టిక్‌ను తగ్గించడం.

స్థిరమైన ఆహార వ్యవస్థలు: స్థానిక, స్థిరమైన ఆహార ఎంపికలను ప్రోత్సహించడం.

వ్యర్థాల తగ్గింపు: వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం.

ఆరోగ్యకర జీవనశైలి: పర్యావరణ అనుకూల జీవన శైలిని అలవాటు చేసుకోవడం.

ఈ–వ్యర్థ నిర్వహణ: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం.

ఈ అంశాలపై సంవత్సరం పొడవునా వివిధ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, పోటీల ద్వారా విద్యార్థులకు పర్యావరణ సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుంది.

చర్యలు తీసుకుంటాం



పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాం. ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేసేలాగా చర్యలు తీసుకుంటాం.

– మోహన్ రావు, ఎకో క్లబ్ జిల్లా కోఆర్డినేటర్

క్లుప్తంగా

చెరువులో మునిగి ఒకరు మృతి


రాజు (ఫైల్)

బాసర: ప్రమాదవశాత్తు చెరువులో నీటమునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన బలగం రాజు (38) మూడు రోజులుగా మైలాపూర్ గ్రామంలోని చెరువులోకి దిగి కమలం పూలు తెచ్చుకుని విక్రయిస్తున్నాడు. ఆదివారం పూలకోసం చెరువులోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలులోంచి పడి ఇద్దరు మృతి

బెల్లంపల్లి: నడుస్తున్న రైలులో నుంచి కింద పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు మంచిర్యాల రైల్వే ఎస్సై ఏ.మహేందర్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున రేచినీ రోడ్-బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలులో నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి 40 నుంచి 45 ఏళ్లు ఉండగా మరొకరికి 25 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉన్నట్లు అంచనా వేశారు. మృతదేహాల వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఇరువురి చేతులపై మామ్, డాడ్ అనే టాటూలు ఉన్నాయన్నారు. ఒకరి వద్ద ఈనెల 14న నాగ్‌పూర్-కాచిగూడకు వెళ్లడానికి తీసుకున్న రైలు టిక్కెట్ లభించింది. మృతుల వివరాలు తెలిసిన వారు 8712658596, 94908 71784, 9949304574 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. మంచిర్యాల రైల్వే ఎస్సై కేసు నమోదు చేయగా బెల్లంపల్లి రైల్వే ఎస్సై సుధాకర్, రామగుండం, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిగౌడ్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి)గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డొంగుర్గాం గ్రామానికి చెందిన జంగిపల్లి నర్సయ్యకు గాయాలయ్యాయి. ఘటనకు కారకుడైన స్కూల్ బస్సు డ్రైవర్ పంజాబ్ రాష్ట్రానికి చెందిన దళవీర్ సింగ్‌ను ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

వంట చేస్తుండగా అగ్నిప్రమాదం

ఖానాపూర్: బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామానికి చెందిన గట్టు నర్సవ్వ ఆదివారంరాత్రి ఇంట్లో మినీ సిలిండర్‌పై వంట చేస్తుండగా మంటలు చెలరేగి వృద్ధురాలికి అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పివేసి 108కు సమాచారం అందించారు. ఈఎంటీ కృష్ణ, పైలట్ అజర్ హుస్సేన్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తేమ లేకుండానే విత్తనం

- ఖరీఫ్ పనులు ముమ్మరం
- పొడి దుక్కిలోనే విత్తనాలు వేస్తున్న రైతులు
- అదను దాటుతోందని ఆందోళన


నెన్నెలలో పొడి దుక్కిలోనే పత్తి విత్తనాలు వేస్తున్న వ్యవసాయ కూలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: రుతుపవనాలు వచ్చినా తొలకరి వర్షాలు పలకరించనేలేదు. ఈనెల 8న ఆదివారం మృగశిర కార్తె (మిరుగు) ప్రారంభం కావడంతో రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్తె వ్యవసాయ పనులకు శుభసూచకంగా భావించి విత్తనాలు వేస్తున్నారు. ఇన్ని రోజులు ఇంటికే పరిమితమైన రైతులు చేలల్లో పత్తి విత్తనాలు వేస్తూ.. దుక్కులు దున్నుతూ.. సేంద్రియ ఎరువులు వేస్తూ కనిపిస్తున్నారు. వ్యవసాయ సామగ్రి, విత్తనాలు సమకూర్చుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. భూమిలో తేమ లేకున్నా పొడిదుక్కిలోనే విత్తనాలు వేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే మొలక వచ్చే అవకాశం ఉంది. తేలికపాటి వర్షాలు కురిస్తే విత్తనం భూమిలో మురిగిపోయే ప్రమాదం ఉంది. వాతావరణ శాఖ జూన్ నుంచి అక్టోబర్ మొదటి వారం వరకు నైరుతి కాలంగా వర్షపాతాన్ని లెక్కించడం ప్రారంభిస్తుంది. జూన్ 1 నుంచి 15 వరకు జిల్లా సగటున సాధారణ వర్షపాతం 62.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 24.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 62 శాతం లోటుగా నమోదైంది. కొద్ది రోజులుగా మబ్బులు పడుతూ చిరుజల్లులకే పరిమితం అవుతోంది. ఒకటి రెండు భారీ వర్షాలు కురిసి నేలలో 60 నుంచి 70 శాతం తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పొడిలోనే విత్తనం..

ఈ ఏడాది రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన భారీ వర్షాలు కురియలేదు. గత నెలలో ఉపరితల ఆవర్తనం, అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు వ్యవసాయ పనులు వేగవంతం చేశారు. కానీ జూన్‌లో వర్షాలు కురియడం లేదు. వానాకాలం సాగు పంటలు విత్తుకునేందుకు మిరుగు కార్తె ప్రారంభంగా భావించి వానలు పడుతాయనే ఆశతో రైతులు పత్తి విత్తనాలు వేస్తున్నారు. గతేడాది కూడా ప్రథమార్థంలో వర్షాలు కురిసినా.. తర్వాత పంట ఎదిగే సమయంలో ముఖం చాటేయడంతో ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయారు. ఈసారి కూడా నైరుతి రుతుపవనాలు ముందుస్తుగానే వచ్చినా ఇంకా వర్షాలు రాకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

3,33,565 ఎకరాల్లో సాగు అంచనా

జిల్లాలో ఈ ఏడాది పత్తి 1,58,753 ఎకరాలు, వరి 1,58,161, కందులు 1,054, మొక్కజొన్న 531, పెసలు 116, మినుము 69 ఎకరాలు, ఇతర పంటలు 14,881, మొత్తం 3,33,565 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువుల ప్రణాళిక రూపొందించారు. గతేడాది పత్తికి మద్దతు ధర రూ.7,521 ఉండగా ఈ ఏడాది రూ.8,110 చెల్లించాలని నిర్ణయించారు. రూ.589 మద్దతు ధర పెరగడంతో ఈ ఏడాది రైతులు ఎక్కువగా పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. కాగా పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడి పత్తి సాగు చేస్తుండగా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఖరీఫ్ రైతులకు కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమయం ఉంది..



ఈ నెల 15 నుంచి జూలై 15 వరకు పత్తి విత్తనాలు విత్తుకోవచ్చు. ప్రస్తుతం నేలలో వేడి ఎక్కువగా ఉండడం వలన విత్తనం చెడిపోయే ప్రమాదం ఉంది. భారీ వర్షాలు కురిసి నేలలో ఫీట్ లోపలి వరకు నీరుచేరి 60 నుంచి 70 శాతం తేమ ఉంటే విత్తనం వేసుకోవచ్చు. తేలికపాటి వర్షాలకు తొందరపడి విత్తనం వేసుకుంటే మొలక దెబ్బతినే ప్రమాదం ఉంది.

– రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్త, ఆదిలాబాద్

ఆలయంలో చోరీ నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని చాడేశ్వరి మాతా ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్ వారం రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా జైలు నుంచి విడుదలై వచ్చాడు. గంజాయికి బానిసైన ఆయన శనివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో క్రాంతినగర్‌కు చెందిన షేక్ అయ్యాన్, మహారాష్ట్రకు చెందిన రాహుల్‌తో కలిసి చాడేశ్వరి మాతా ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. వాచ్‌మెన్ గంగయ్యను కత్తితో బెదిరించి రూ.3వేల నగదు, బీరువాలో ఉన్న ముక్కుపుడకను దొంగిలించి పరారయ్యారు. ఆదివారం వడ్డెర కాలనీలో చోరీకి ప్రయత్నించాడు. రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి గంజాయి సేవించే పరికరం, రూ.వెయ్యి నగదుతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డీసీసీబీ డైరెక్టర్ హరీష్‌రావు కిడ్నాప్..!

- అర్ధరాత్రి ఇంట్లో నుంచి తీసుకువెళ్లిన దుండగులు
- తుఫ్రాన్ టోల్‌ప్లాజా వద్ద తప్పించుకున్న బాధితుడు


నిర్మల్ సబ్ డివిజనల్ కార్యాలయానికి హరీష్ రావును తీసుకొస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: మామడ మాజీ ఎంపీపీ, ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిక్యాల హరీష్ రావు కిడ్నాప్‌కు గురైన సంఘటన జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం అర్ధరాత్రి 2 గంటలకు మామడ మండలం పోన్కల్ గ్రామంలో హరీష్ రావు తన ఇంట్లో నిద్రపోతున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆయనను తన వాహనంలోనే కిడ్నాప్ చేశారు. హైదరాబాద్ వైపు తరలించారు. వెళ్లే దారిలో భారీగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో హరీష్ రావు తన సన్నిహితులకు ఫోన్ చేసి కొంత నగదు కావాలని కోరినట్లు సమాచారం. తుఫ్రాన్ టోల్ ప్లాజా వద్ద కారు ఆగిన సమయంలో హరీష్ రావు చాకచక్యంగా కారు దిగి తప్పించుకున్నారు. దీంతో దుండగులు ఆగకుండా టోల్ గేటును గుద్దేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. హరీష్ రావు జరిగిన విషయాన్ని టోల్ ప్లాజా సిబ్బందికి తెలియజేసి తుఫ్రాన్ పోలీసులను సంప్రదించాడు. దీంతో పోలీసులు హరీష్‌రావును ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయానికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హరీష్ రావు వద్ద గతంలో పనిచేసిన వ్యక్తే కిడ్నాప్ చేసినట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోంది.

'ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను కొనసాగించాలి'


నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ ముద్దుబిడ్డ, రాష్ట్ర మంత్రి సీతక్కను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొనసాగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ కోరారు. ఆదివారం మావల మండలంలోని కుమురం భీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీల ఆశాజ్యోతి సీతక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమయ్యారన్నారు. ప్రజల మన్ననలు పొందారన్నారు. ముఖ్యంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో పాటు ఆదివాసీ చట్టాలు, హక్కులు, సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న మంత్రిని మార్చడం ఆదివాసీలను అవమానపర్చడమే అవుతుందన్నారు. అంతేకాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను సీఎం సైతం దత్తత తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షురాలు ఆత్రం గణపతి, నాయకులు వెడ్మ ముకుంద్ రావు, తొడసం ప్రకాశ్, గోవింద్‌రావు, గేడం గణేశ్, గేడం శ్యాంరావు, మనోహర్, దశరథ్, వెట్టి బాలు, సిడాం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు



చదువుల తల్లి కొలువై ఉన్న బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి భక్తులు తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. 1000 రూపాయల ప్రత్యేక అక్షరాభ్యాసం 378 టికెట్లు, సాధారణ అక్షరాభ్యాసం 150 రూపాయల టికెట్లు 824, అద్దెగదులు, చండీ హోమం, శ్రీ సత్యనారాయణ పూజ, వాహన పూజ టికెట్ల ద్వారా రూ.12,07,210 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు.

– బాసర

కత్తులతో పోస్టు పెట్టిన ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో కత్తులతో పోస్టుపెట్టిన ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరవాడకు చెందిన దస్గట్ సుధీర్ మూడు నెలల క్రితం మావలలో పశువుల వాహనాన్ని అడ్డుకుని సదరు యజమానిని చంపుతానని బెదిరించినట్లు పేర్కొన్నారు. డబ్బులు వసూలు చేసి దౌర్జన్యం చేసిన కేసులో పరారీలో ఉన్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో కత్తులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తేలా పోస్టులు పెట్టినట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ యజమానిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. అతనిపై పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అల్లపల్లిలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి సోషల్ మీడియాలో పెట్టిన కత్తి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో వన్‌టౌన్, మావల సీఐలు సునీల్ కుమార్, కె.స్వామి పాల్గొన్నారు.

17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన


బెల్లంపల్లి: ఈసెట్-2025 ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్లను ఈనెల 17, 18, 19 తేదీలలో పరిశీలించనున్నట్లు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా, బీఎస్సీ, మ్యాథమెటిక్స్ అడ్మిషన్‌ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 18 వరకు విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం సర్టిఫికెట్లు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌తో పాటు అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సెంటర్లలో స్వయంగా సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్‌కు వచ్చే విద్యార్థులు ఈసెట్-2025 హాల్ టిక్కెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి మెమో, డిప్లమా /బీఎస్సీ మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల, నివాస, ఆదాయ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్ సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులైన విద్యార్థులు హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఈనెల 21 వరకు కోర్సులు, కళాశాలల ఎంపికను పూర్తిచేసి ఫ్రీజ్ చేయాలని, ఆ తదుపరి సీట్ల కేటాయింపు జరుగుతుందని ప్రకటించారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో డీఐజీ పూజలు


డీఐజీని శాలువాతో సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

జైనథ్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో డీఐజీ తరుణ్ జోషి ఆదివారం పూజలు చేశారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రాకేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, నాయకులు జగదీశ్‌రెడ్డి, బద్దం సురేష్ రెడ్డి, రాజన్న, వెంకటి, బండి పోచన్న, పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు తపస్ నేతలు


సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు

మంచిర్యాలటౌన్: సిమ్లాలో జరుగుతున్న అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ జాతీయ కార్యకారిణి సమావేశాలకు మంచిర్యాలకు చెందిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు హాజరయ్యారు. జిల్లా నుంచి బండి రమేశ్, తెల్కలపల్లి పెంటయ్య హాజరై విద్యారంగానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని కోరారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

భీమారం: మండలంలోని పోలంపల్లి, భీమారం గ్రామాల సమీపంలో ఆదివారం రెండు చోట్ల దాడులు నిర్వహించి నాలుగు కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పోలంపల్లి సమీపంలో నకిలీ పత్తి విత్తనాలతో వెళ్తున్న రేషవేని సత్యనారాయణను పట్టుకున్నట్లు తెలిపారు. భీమారం సమీపంలోని బాల్క సుమన్ రోడ్డులో ఒక సంచితో అన్నవేని నర్సయ్య అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా నకిలీ పత్తి విత్తనాలు లభించాయన్నారు. ఈ మేరకు వ్యవసాయ అధికారి సుధాకర్‌తో పరీక్షలు నిర్వహించగా గ్లైసిడ్ విత్తనాలు అని తేలిందన్నారు. ఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

కడెం ఎడమ కాలువ సిల్ట్ తొలగింపు


పొక్లెయిన్‌తో సిల్ట్ తొలగిస్తున్న సిబ్బంది

కడెం: కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ గేట్ల వద్ద పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగు రోజులుగా పొక్లెయిన్ సహాయంతో సిల్ట్‌ను తొలగిస్తూ కాలువ నీరు చివరి ఆయకట్టుకు సక్రమంగా చేరేలా మరమ్మతు పనులు చేస్తున్నట్లు ఈఈ విఠల్ పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

తాంసి: మండలంలోని వడ్డాడిలో మత్తడివాగు ప్రాజెక్టు వద్ద ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ఆదివారం తాంసి పోలీసులు కాపాడారు. తాంసి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ప్రభాకర్ కుటుంబ సమస్యలతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకునేందుకు సాయంత్రం ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు 100కు డయల్ కాల్ చేయడంతో అప్రమత్తమైన పెట్రోలింగ్ సిబ్బంది వికాస్ అదుపులోకి తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు సైతం మత్తడివాగు ప్రాజెక్టు వద్దకు ఆత్మహత్యకు పాల్పడటానికి రాగా పోలీసులు అడ్డుకున్నారు.

హైదరాబాద్‌లో యువకుడి ఆత్మహత్య

- ముల్కల్లలో ఉద్రిక్తత
- మహిళ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం


ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్):మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన దేవి ప్రశాంత్ (27) హైదరాబాద్‌లో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన వెనుక వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. దేవి ప్రశాంత్ బీటెక్ పూర్తి చేసి అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ముల్కల్లకు చెందిన ఓ మహిళతో అతనికి పరిచయం ఏర్పడి అదికాస్తా వివాహేతర సంబంధంగా మారింది. మూడు నెలల క్రితం వివాహిత తన కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లగా, కుటుంబ సభ్యుల ఒత్తిడితో కుమారుడిని అప్పగించింది. పంచాయితీ తర్వాత ఇరువురూ విడివిడిగా ఉంటున్నా.. సోషల్ మీడియాలో చాటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వారం క్రితం ఇరువురూ మరోసారి హైదరాబాద్ వెళ్లారు. దీంతో వివాహిత కుటుంబ సభ్యులు హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ప్రశాంత్ సోదరుడు రాజశేఖర్ సహాయంతో వివాహిత గురువారం ఇంటికి తిరిగి వచ్చింది. అయితే ప్రశాంత్ హాజీపూర్, మంచిర్యాల ప్రాంతాల్లో తిరిగి, చివరకు హైదరాబాద్‌కు వెళ్లాడు.

ఆత్మహత్యపై అనుమానాలు

శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ నుంచి రాజశేఖర్‌కు ఫోన్ వచ్చింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లి చూడగా ప్రశాంత్ విగతజీవిగా కనిపించాడు. అతని మృతిపై కుటుంబ సభ్యులు బలమైన అనుమానాలు వ్యక్తం చేశారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లో ప్రశాంత్ మృతదేహాన్ని గుడిపేటకు తీసుకొచ్చారు.

అంబులెన్స్ డ్రైవర్ల ర్యాలీ..

ప్రశాంత్ సహచర అంబులెన్స్ డ్రైవర్లు సంతాపసూచకంగా వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహిత కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు వివాహిత తల్లిదండ్రుల ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లి ఆందోళన నిర్వహించారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ప్రశాంత్ సోదరుడు రాజశేఖర్ తమ్ముడి మరణం ఆత్మహత్య కాదని, వివాహిత కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపిస్తున్నాడు.

పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి

మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, లక్సెట్టిపేట ఎస్సై గోపతి సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

'సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలి'


మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీఐటీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రీజియన్ మహాసభను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా చర్చించారు. యాజమాన్యం తగ్గిస్తున్న ఓటీల గురించి, కార్మికుల వేధింపులు, డబల్ డ్యూటీపై చర్చించారు. ప్రతి డిపోలో కార్మికులు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలన్నారు. అనంతరం ఆదిలాబాద్ రీజియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.భీమ్‌రావ్, కార్యదర్శిగా ఎం.భీమ్‌రావ్, కోశాధికారిగా నారాయణ, ప్రచార కార్యదర్శిగా ఎం.పొచ్చన్నతో పాటు ఎనిమిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మూడు గేదెలు మృతి

మందమర్రిరూరల్: పట్టణంలోని జాతీయ రహదారిపై లక్ష్మీభవాని కాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు గేదెలు మృతి చెందాయి. మందమర్రి వైపు నుంచి మంచిర్యాల వైపు అతివేగంగా వచ్చిన లారీ రోడ్డుపై ఉన్న మూడు గేదెలను ఢీకొట్టడంతో మృతి చెందాయి. ఎస్సై రాజశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన గేదెల కళేబరాలను తొలగించారు.